# వలపు

**"విత్తనములు** మొలకెత్తుట కేమి కావలయను? గాలి నీరు, సారవంతమైన నేల కావలయును. విత్తనములు మొలకెత్తుట కేమి కావలయును?...."

ఎలిమెంటరీ స్కూలులో ఒక విద్యార్థి మిగత విద్యార్థులచేత ప్రశ్నకు సమాధానం తిరిగి తిరిగి చెప్పిస్తున్నాడు.

నడుస్తున్న నాగభూషణం క్షణకాలం ఆగి మరీ మరీ విన్నాడు. "అనుకూల పరిస్థితులలోనే విత్తనములు మొలకెత్తును...".

ఉపాధ్యాయని గొంతు వినిపించింది. నడుస్తూనే అనుకుంటున్నాడు.

"అవును, అనుకూల పరిస్థితులలోనే విత్తనములు మొలకెత్తును. దేనికైనా అనుకూల పరిస్థితులు కారణము". అనుకుంటూ ఆగిపోయాడు క్షణకాలం. ఆగవలసిన చోటనే ఆగాడు-ఆగవలసిన క్షణంలోనే గడియారం చెప్పినట్టుగా ఆగాడు. చూడవలసిన వేపే చూశాడు. చూడవలసిన వ్యక్తినే చూశాను. ఆమె అక్కడే కంచె అవతల నిలబడి ఉంది.

ఆ వూరు చిన్నవూరే. కాని చాలా వూళ్ళ కన్న గుర్తింపు ఉన్న వూరు. నలుచదరంగా ఉండే ఆ వూరి 'వైశాల్యం ఒక చదరపు ఫర్లాంగు ఉంటుదేమో! అందులోనే ఒక వంక ఎలిమెంటరీ స్కూలుంది రెండో వంక హైస్కూలుంది. మూడో వేపు శివాలయం దానికి దగ్గరగా పోస్టాఫీసు ఉన్నాయి. వీటి కెదురుగా కోనారి కోనేరుంది. ఎలిమెంటరీ స్కూలు ప్రక్కనే ఈ మధ్య-ఒక ఎనిమిది తొమ్మిది నెలల క్రితం ఒక గ్రామీణ బ్యాంకు ఏర్పడింది. అందులో క్లర్కుగా పనిచేయడానికొచ్చిన వాడే నాగభూషణం. అతనుండేది శివాలయం వీధిలో చెరువు గట్టు మీద వరుసగా ఉన్న నాలుగిళ్ళలో దూరంగా ఉన్న చివరింటిలో. ఆ ఇంటి వెనుక ఒక చిన్న మామిడితోట, విశాలమైన పెరడు, తోటముందు పెరటిలో ఒక గిలకబావి, ఆ బావి చుట్టు పెళ్ళి కెదిగిన అమ్మాయిల్లా అరటి చెట్లు - ఆ పెరటిలోనే అందమైన పూల మొక్కలు-పాత పెంకుటిల్లయితేనేం గాక నివాస యోగ్యమై నాలుగు గదులతో మడికి, మైలకి వేరు వేరుగా ఏర్పాట్లతో వాకిలి ముందు రెండు పోక చెట్లతో చూడ ముచ్చటగా ఉంటుంది. విశాలమైన పెరటితో, తోటతో ఉండే ఆ ఇంటిలో వూరికి దూరంగా, పొలాలకి దగ్గరగా చెరువు గట్టున ఉన్న ఆ ఇంటిలో ఏవి ఉండకూడదు? ఏవైనా ఉండవచ్చు. ఏవి ఉన్నా లేకపోయినా పెరటిలో నాగుపాములు, తాచుపాములు తిరుగుతున్నాయంటారు. కోనేరులోపడి ఆత్మహత్య చేసుకున్న కోనారి ఆ ఇంటి ప్రాంతంలో పెద్ద దయ్యమై తిరుగుతూ ఉంటాడని కొందరంటారు. అది కిట్టనివాళ్ళనే మాట అని గవరమ్మ అంటుంది. ఆమె ఇంటి యజమానురాలు. ఆమె ఇంటికి దూరంగా ప్రక్క వూరిలో కొడుకు దగ్గర ఉండటం చేత, ఇంత చక్కని ఇల్లు కూడా పాడుపడినట్టయి పోయింది. ఇదిగో- ఈ మధ్యనే నాగభూషణం రాకతో

ఆ ఇంటికి కళ వచ్చింది. గవరమ్మే దగ్గరుండి ఇల్లు, పెరడు, బావి బాగుచేయించింది. ఇప్పుడు నిజంగా ఆ ఇల్లు చూడముచ్చటగా ఉంటుంది. అందుచేత కోనేటికి నీటిలో కొచ్చేవారు, స్నానాల కొచ్చేవారు ఒకసారన్నా ఇంటి వేపు చూడకపోరు. చూచినవారంతా ఆ ఇంటి అందాన్ని ఆస్వాదించటంకోసమే చూస్తున్నారంటే పొరపాటే. అందులో చాలా మంది నాగభూషణాన్ని చూడటం కోసమే చూస్తారనటం సబబు. ఎందుకంటే, అతని కింకా పెళ్ళి కాలేదు. చెప్పకోదగ్గ అందగాడే అతడు.

నాగభూషణానికి మాత్రం పెద్దలు, పిన్నలు ఎందరో తన మీద ఆశలు పెట్టుకున్నారన్న విషయం మాత్రం తెలియదు. స్వతహాగా అతడు బిడియస్తుడు నెమ్మదస్తుడు. అమాయకుడు. కానీ తెలివైనవాడు. ఈ తెలివితేటలు యూనివర్శిటి పరీక్షలు పాసవటానికి పనికి వచ్చేవే అని మాత్రం తెలుసుకోవాలి. లోకాన్ని చదివే తెలివితేటలే ఉంటే ఈ కథ రాదు.

ఆరు నెలలై ఉంటున్నాడు నాగభూషణం ఆ ఇంట్లో. ఉదయాన్నే గరికన్న ఇల్లు చిమ్మి, మంచి నీళ్ళు పెట్టి, హై స్కూలు వీధిలో ఉన్న హోటలు నుండి టిఫిన్, కాఫీ తెచ్చిపెట్టిన తరవాత ప్రక్క మీద నుండి లేచి బ్రష్ చేసుకుంటూ తోటంతాకలయ తిరుగుతాడు. అది అతనికి ఆనందంగా ఉంటుంది. బావి దగ్గర ముఖం కడుక్కుని, కాఫీ టిఫిన్ తీసుకుని ఒక రోజు ఆలస్యంగా వచ్చే తెలుగు పేపరును చూస్తూ కాలం గడిపి, ఎనిమిదిన్నరకల్లా స్నానం చేసి, రెండోసారి కాఫీ ఫ్లాస్కులోంచి పంచుకుని, తొమ్మిదిన్నర కల్లా తయారై ఆఫీసుకు బయలుదేరతాడు. కోనేటిలో స్నానాలు చేసే ఆడవారో, బట్టలుతుక్కునే వారో అతని వేపు సూటి గానో, వోరగానో చూస్తుంటే గబగబా అడుగు లేసుకుంటూ తలవంచుకునో, ప్రక్కకు తిప్పకునో గండం గడిచిందిరా అన్నట్టు దాటిపోతాడు గతులు తప్పే నడకతో. అందుచేత ఏ సుందరాంగి, ఏ వనజాక్షి, ఏ పద్మనేత్రి, ఏ లతాంగి తన్ను చూస్తున్నదో అతనికి తెలియదు.

"ఈతని పేరు నాగభూషణమా? బాగా కుదిరిందే... కాకపోతే మన్మథుని దహించిన నాగభూషణమైతేనే చికాకు. కానీ చూద్దాం..." అనుకొన్నది. ఆఫీసుకు పోయే నాగభూషణాన్ని కోనేటిలో కాళ్ళు ఉంచుకొని, మెట్టుపై కూర్చుండి, ముఖానికి పసుపు రాసుకుంటూ ఆ అమ్మాయి. అటు తరవాత ఆ అమ్మాయి ఆ వేళలో అక్కడ కనిపించటం మానేసింది.

ఉదయం ఏడుంపావు.

నాగభూషణం కిటికీ దగ్గర నిలబడి గడ్డానికి సబ్బు రాసుకుంటున్న వేళ పెరటిలోని బావి గిలక కిర్రు కిర్రుమని చప్పుడయింది. నాగభూషణం ఉలిక్కి పడ్డాడు. 'ఇన్నినాళ్ళుగా లేనిది ఈరోజు ఏమిటి వింత? ఈ పెరటి బావిలోంచి నీళ్ళు తోడుకోగల సాహసం ఎవరి కుంది?' అని అనుకుంటూ కిటికీ మూలలోంచి పెరటిలోకి చూశాడు. అలా చూస్తే బావి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సారి అతనికీ బావి కనిపించటమేకాదు, ఒక పద్దెనిమిది, ఇరవై ఏళ్ళ వయస్సున్న అమ్మాయి నీళ్ళు తోడుకుంటోంది. అతనికి

ఆమె ముఖం, నడుము భాగం వరకు ఆమె శరీరోపరి భాగం కనిపించసాగాయి, ఆమె నీళ్ళు లాగేటప్పుడు ఆమె ముఖం మరీ స్పష్టంగా కనిపించసాగిందతనికి, ఒక్క క్షణం ఆగి చూశాడు. ఆమె అందంగానే కనిపించింది.

'ఎవరీమె? ఈ పెరటిలోకి ఎందుకు రావాలి?' ప్రశ్న వేసుకున్నాడు.

'ఎవరైతేనే. ఒక బిందెడు నీళ్ళు తోడుకుంటే నాకేం నష్టం ! అయినా ఆ అమ్మాయి గవరమ్మకు తెలిసిన పిల్లో ఏమో!' అని వెంటనే సమాధాన పడ్డాడు.

ఆమె నడుముకు బిందే నెత్తుకుని వచ్చిన వెనుక దారినే వెళ్ళిపోయింది. తలఎత్తి చూడలేదు. ప్రక్కకైనా తిరిగి చూడలేదు.

'ఎవరిమె' ? అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు. అతడు ఆలోచనల్లోంచి తేరుకోక ముందే మళ్ళా బావిగిలక కిర్రుమంది. అప్పుడు సమయం పావు తక్కువ ఎనిమిది. నాగభూషణం కిటికిలోంచి మళ్ళా చూశాడు.ఈ సారి రెండు బిందెలలోకి నీళ్ళు తోడుకుంటోంది, అదే వైఖరి. తల ఎత్తదు. ప్రక్కకు చూడదు. ఒక బిందెను నడుము కెత్తుకుని, చిన్న కూజా బిందెను కుడిచేత పట్టుకుని వచ్చిన దారినే వెనుక వేపు నుండి వెళ్ళిపోయింది.

స్నానానికి తయారవుతూ టవల్‌ను భుజం మీద వేసుకుంటూండగా ఒక బిందెతో వచ్చిం దామె. అప్పుడు టైము ఎనిమిదింపావు. ముందుకువెళ్ళే అతను వెనుక గదిలోనే ఆగిపోయాడు. ఆమె రెండు చీరెలు ఉతుక్కుని, బిందెలో నీళ్ళు నింపుకుని, చీరెలు భుజాన వేసుకుని, నడుముకు బింది నెత్తుకుని తన బాల్చిని పట్టుకుని ముందుకు వెళ్ళుతు' ఒకసారి వెనక్కి తిరిగి చూసి వెళ్ళిపోయింది.

అప్పటి కర్థమైంది నాగభూషణానికి ఆమె మరి తిరిగి రాదని.

ప్రతి రోజూ అతడు స్నానానికి వెళ్ళవలసిన టైము ఎనిమిదిన్నర. ఆ రోజు ఎనిమిది నలబై అయింది. తన కార్యక్రమం బలవంతంగా మార్చబడి నందుకు అతనికి కోసం వచ్చింది కూడా. ఆ రోజు స్నానం కూడా ఆలస్యమైంది. అందుకు అతనికి మరీ చిరాకు వేసింది. మర్నాడూ అంతే జరిగింది. ఏడుంపావు-పావు తక్కువ ఎనిమిది-ఎనిమిదింపావు-ఎనిమిది నలబైకే నాగభూషణానికి బావి దక్కింది.

ఆ రోజు లంచ్ టైములో కేరియర్ తెచ్చిన గరికన్నతో అన్నాడు: "నిన్నటి నుండి మన బావిలోంచి ఎవరో అమ్మాయి నీళ్ళు తోడుకోపోతోందోయ్!"

'ఎవలేటి, బాబూ?' అన్నాడు నిస్మయంతో గరికన్న. "నాకు తెలుసేమిటి? నీళ్ళు తోడుకుంటే నాకేం అభ్యంతరం లేదు. కాని పావు తక్కువ తొమ్మిది వరకు బావి వదలదు. నా పనులన్నీ ఆగిపోతున్నాయి."

"అనాగని సెప్పిండి, బాబూ! తప్పేటి? నా నాపీసుకాడ కొచ్చీయాలి కానీ, నేపోతే నానే సెప్పీద్దును. ఏటా ఇకారాలు! పెద్దమడుసులతో యవ్వారమా? మరేటన్నావా? మీకేం బయం నేదు. సెప్పిండి రావద్దనే సెప్పిండి" అని గరికన్న సలహా ఇచ్చాడు.

నాగభూషణం మాత్రం అలా చెప్పలేకపోయాడు. అలా మరో వారం రోజులు

సాగింది. నాగభూషణం కూడా తన వేళలను సర్దుకున్నాడు. ప్రతి రోజూ బావి దగ్గర ఆమె గాజుల చప్పుడు అతనికి ఆనంద దాయకంగా ఉంది. ఒక రకంగా కిటికిలోంచి ఆమెను చూడటానికే అలవాటుపడ్డాడు. ఆమె రాకకై నిరీక్షించటం దిన చర్యలో ఒక భాగమయింది. తల దించుకుని పోయే ఆమె నుదుటిపైపడే ముంగురుల్ని కుడి మోచేతితో సర్దుకునేటప్పుడో, బిందెను నడుము కెత్తుకునేటప్పుడో, తల ఎత్తి చూడ సాగింది నాలుగైదు రోజుల నుండి. ఒకటి రెండు సాళ్లు తన వేపు చూడటం కూడా నాగభూషణానికి గుర్తు.

అకస్మాత్తుగా ఆమె బావి దగ్గర నిలిచే వ్యవధి మరి కొంత పొడిగింపబడింది. ఆ పొడిగింపులో జరిగేదే ఆమె స్నాన కార్యక్రమం. ఈ కార్యక్రమం ఒకింత ఆసక్తి దాయకంగాను, మరొకింత ఇబ్బంది కరంగాను తయారైంది నాగభూషణానికి. ఆమెను రానీయకుండా ఉండాలని ఎంత మనుసులో ఉందో, ఆమె రాకపోతే ఎలాగ అన్నది అంతగానూ ఉన్నది అతనిలో.

ఆ రోజు రీజనల్ మేనేజర్ ప్రోగ్రామ్.

ప్రతి రోజు కన్నా కొద్దిగా ముందుగా వెళ్ళి వర్కు చూచుకోవలసి ఉంది. అంత క్రితం రాత్రి చాలా సేపటి వరకు బ్యాంక్‌లోనే ఉండవలసి రావటంచేత ఉదయం ఎనిమిదికి గాని అతనికి మెలకువ రాలేదు.

అతను ఆదరా బాదరా ముఖం కడిగి స్నానానికి తయారయ్యేసరికి ఆమె ప్రత్యక్షం. నాగభూషణం ఒళ్ళు మండిపోయింది అప్పటికే ఆమె బట్టలు స్నానానికి వీలుగా అమర్చుకుంటోంది. కోపంతో దబదబా ఉన్న నీళ్ళనే వెనుక గదిలో నాలుగు చెంబులు దిమ్మరించుకుని ఆఫీసుకు తయారై పరుగెత్తాడు. ఆర్.ఎమ్. రాక కాస్త ఆలస్య మయింది గానీ లేక పోతే మాట పడేవాడే.

మర్నాడు ఆమె స్నానం చేసి నీళ్ళు తీసుకువెళ్ళే వేళ సాహసించి ఆమె ఎదుట పడి, "మీరు రావటం గాని, నీళ్ళు తీసుకెళ్ళటం గాని నాకు అభ్యంతరాలు కావు. కాని మీరు గంటల తరబడి బావి దగ్గరే ఉంటే నా పనులు చెడుతున్నాయి. ఆఫీసులో మాట పడవలసి వస్తోంది." అని రిహార్సలు చేసుకున్న నాలుగు మాటల్ని తప్పు లేకుండా అనేశాడు.

ఆమె కొద్ది సేపు మాటల్లేకుండా నిలబడి ఒకసారి కన్నెత్తి చూచి, తల దించుకుని, "క్షమించండి ... దూరమైన మాకు మంచి నీటి బావి ఇదొక్కటే ... ఇంటిల్లిపాదికి నీళ్ళు కావాలి. అందుకే? కోనేరు దగ్గర ఆకతాయి కుర్రాళ్ళు .... అందుకే స్నానం ఇక్కడ...మీరు మంచివారు ... మీకు అసౌకర్యం కలిగించను..." అవి వణుకుతున్న గొంతుకతో ఆమె అంటూంటే, కనుల వెంట నీరు చిప్పిల్లి నదేమో అన్న అనుమానం కూడా కలిగింతనికి.

'అయ్యో! ఆమెకు బాధ కలిగించా నేమో' అని అత డనుకునేంతలో ఆమె కదలిపోయింది.

మర్నాడు ఉదయం ఏడుంపావుకి పెరటిలో బావి దగ్గర ఏ చప్పుడు

వినిపించలేదు నాగభూషణానికి. ఒంట్లో శక్తి నెవరో పీల్చేసినట్ట నిపించిందతనికి. బావివేపే చూస్తూ చాలాసేపు గడిపాడు. ఆమె రాలేదు. ఏదో పోగొట్టుకొన్నట్ట నిపిస్తూంటే అన్యమనస్కంగా స్నానం చేసి బ్యాంకుకు తయారయ్యాడు. తొమ్మిదిన్నరికి వీధి మలుపు తిరుగు తూంటే బిందెతో, సగం తడిసిన బట్టలతో ఎదురు పడిం దామె. ఆమెను చూచినడక వేగం తగ్గించాడు. ఆమె అతన్ని గమనించి' ఒకసారి తలెత్తి, కనులెత్తి చూచి కనులు దించుకుని ముందుకు కదలిపోయింది. అతని మనసేదో అయింది. ఆ రోజంతా బ్యాంకులో యాంత్రికంగానే గడిపాడు.

మర్నాడూ ఆమె రాలేదు. మూడో రోజూ అంతే. కాని తొమ్మిదిన్నరకి వీధి మలుపు సమీపంలో ఎక్కడో అక్కడ హై స్కూలు వీధిలో ఆమె కనిపిస్తూనే ఉంది ఆఫీసుకెళ్ళే నాగభూషణానికి.

'ఈమె ఇక రాదు...' నిర్ధారణ చేసుకున్నాడు.

'రాకపోతే నాకేం?'... అని ప్రశ్న వేసుకున్నాడు. కాని దానికన్నా ముందు 'ఆమె రావటం మాన కూడదు. రావాలి' అనిపట్టు పడుతున్నట్టు అనుకున్నాడు.

'ఆమె రావాలి. వచ్చి తీరాలి,' పదే పదే అనుకున్నాడు.

నాల్గవ రోజు ఉదయం తొమ్మిదిన్నరకి అదే వీధిలో నీళ్ళతో ఎదురుపడిం దామె. నాగుభూషణం అడుగులు తడబడ్డాయి. గుండె వేగం హెచ్చింది. గొంతు తడారిపోయింది. ఆమెకూడా నెమ్మదిగా నడుస్తోంది. ఆమె సమీపానికి రాగానె ఎవరితోనో అంటున్నట్లుగా ఆమెకే వినిపించేటట్టు "రావటం మానేశారు. నే నేమన్నానని... రావడం మానకండి" అని గబగబా అనేసి ముందుకు నడిచిపోయాడు. ఆ మాటల నామె విని కళ్ళారా అతన్ని చూసినట్టు అతనికి తెలియదు.

సాయంత్రం బ్యాంకునుంచి వచ్చి బావి దగ్గర కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కుంటూంటే వెనుక ఏదో చవ్వడై వెనుదిరిగి చూశాడు. వెనుక ఆమె! చేతిలో ఏమీ లేవు 'ఎందుకొచ్చినట్టు' అని ఆశ్చర్య పోతూ- "మీరా!" అన్నాడు. అవును- నేనే' అన్నట్టు తల ఒక ప్రక్కకు వంచి నిలువుగా తలాడించింది.

తీగమీదనుండి టవల్ అందుకుని ముఖం తుడుచు కుంటూ-"నామీద కోపంతో కదా రావడం మానేశారు?" అన్నాడు ధైర్యంగా.

'అదేంకాదు. మీకు కష్టం కలిగించటం ఇష్టం లేక ' అందామె. ఆమె మాటలు ముద్దుముద్దుగా విన సొంపుగా అనిపించా యతనికి.

"నాకేం కష్టం లేదు. మీరు రావడం మానకండి" అన్నాడు అనునయింపుగా.

'నేనేందుకు రావాలి' అని అడగకూడదనో, మరి ఆమెకు తోచలేదో ఏ కారణమో ఆమె అడగలేదు.

"సబ్బు ఇంకా ఉంది" అంది అతని ము:ఖం వేపు చూస్తూ.

"ఎక్కడ?" అంటూ టవల్‌తో తుడుచుకో బోయాడు.

"అలా కాదు.అగండి" అంటూ పైటకొంగు బోడ్లోదోపుకుని. చీరకుచ్చిళ్ళు

పైకి లాక్కుని బాల్చీ అందుకుని అతను వారిస్తున్నా వినక నీళ్లతోడి "లుంగీ కాస్త పైకి ఎత్తి కట్టుకోండి. తడిసి పోతుం" దని ఆజ్ఞ జారీచేసి చెంబుతో నీళ్ళందించింది. ముఖం మీద నీళ్ళు పోసుకున్న తర్వాత టవల్ అందించింది.

"మీకు చాలా శ్రమ కలిగించాను" అన్నాడు ఆమె చేతి వ్రేళ్ళ స్పర్శకు పులకించిపోతూ.

"శ్రమకే ముంది. మీరు మంచివారు. మీ కలా అనిపిస్తుంది. ... ఒక మాట" అంది నెమ్మదిగా.

"ఏమిటి?" అన్నాడు టవల్ భుజం మీద వేసుకుంటూ.

"ప్రతి సాయంత్రం ఒక బిందెడు నీళ్ళు తీసుకెళ్తాను. మీ కభ్యంతరమా"? అంది నూతిగట్టున నీటి చుక్కలను కలుపుతూ ఏదో ఆకారం తేవడానికి ప్రయత్నిస్తూ తల వంచుకునే.

'నాకేం అభ్యంతరం? నాకే అభ్యంతరం లేదు. నిజానికి రోజంతా మీరు బావి దగ్గర నీటికోసం ఉన్నానా కభ్యంతరం లేదు. అలాగే రండి" అన్నాడానందంగా.

"చాలా థాంక్సండి. కాని రోజంతా బావిదగ్గరే ఉండాలని కోరకండి. నీళ్ళు తోడి-తోడి చేతులు పడిపోతున్నాయి. మీకేం తెలుస్తాయి మా ఆడవాళ్ళ బాధలు!" అందామె నిష్ఠురంగా అతనింటికే నీళ్ళు తెచ్చి పోస్తున్నట్టు.

"అయ్యో! అది కాదండి. సారీ అండి..మీకు కష్టం కలిగించాలని కాదండి...." అంటూ నొచ్చుకున్నాడు.

'ఫరవాలేదండి' అన్నట్టు నవ్వేసిం దామె.

'హమ్మయ్య' అన్నట్టు అతనూ నవ్వేశాడు.

"వెళ్తానండి మరి" అంది.

"అయ్యో! అప్పుడేనా?" అన్నాడు. ఆ అరటి చెట్ల మాటున మునిమాపు వేళ ఆమెకు దగ్గరగా అతని కేదో మత్తుగా, గమ్మత్తుగా, హాయిగా ఉంది. ఆమె వెళ్ళిపోతే ఎలా?

"చీకటి పడుతోంది. పాములుంటాయి. ఈ దారి నొస్తే ఎవరికి కనపడనని గాని ఇది ప్రమాదకరమైన దారి-వస్తాను అంది.

"మరి రేపు ఉదయం వస్తారుగా!" ప్రార్థిస్తున్నట్టన్నాడు.

"అలాగే" అంది.

"నామీద కోపం లేదు గదా!"

"వూహూ" అంది.

"ఒట్టు" అన్నాడు చెయ్యి జాస్తూ.

ఆమె చెయ్యి ఇవ్వకుండా "లేదు లెండి" అంటూ కదలింది.

ఆమె గేటువేపు వెళుతూంటే ఆమె వెనుకే కదలాడు.

ఆమె ఆగి, వెనుదిరిగి "మీరు వెనుక రాకండి ఎవరేనా చూస్తారు" అని హెచ్చరించి ముందుకు నడిచింది.

ఆమె వెళ్ళిపోతూంటే దిగులుగా అటే చూస్తూ ఉండిపోయాడు.

ఆ రోజు సాయంత్రం నుండి కాలువ గట్టుకు షికారు వెళ్ళటం మానుకున్నాడు నాగభూషణం.

ఉదయం ఎనిమిదిన్నరకల్లా తన పని ముగించుకుని వెళ్ళిపోతుంది. వెళ్ళేముందు రెండు పెద్ద ప్లాస్టిక్ బక్కెట్లలో నీళ్ళు తోడి స్నానం చెయ్యండని హెచ్చరించి వెళ్లిపోతుందే బావిదగ్గర నుండే తడి బట్టలతో.

సాయంత్రం బావి దగ్గర ఆమెను చూడనిదే ఉండలేకపోతున్నాడు నాగభూషణం. ఆమె ఏవో కబుర్లు చెపుతుంది. వింటాడు. నీళ్ళు తోడి ఆమె బిందెలో పోస్తాడు. అరటి బోదెల దగ్గర ఆమె కూర్చుని, స్నానం చేసే రాళ్ళ మీద ఎదురెదురుగా కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకుంటారు. ఏమీ తోచకపోతే చేతి గాజులు సవరిస్తాడు. పాదాల మీద పట్టీలు సవరిస్తాడు. గిలిగింతలు పెట్టినట్టు ఆమె నవ్వుతూంటే పరవశించిపోతాడు.

"వెల్తాను". అంటుంది.

"అప్పుడేనా?" అనే వాడు మొదట్లో దిగులుగా.

"వెళ్ళకు" అనటం ప్రారంభించాడు తరువాత.

"అమ్మో ! మా అమ్మ చంపేస్తుంది, బాబూ. నే వెళ్ళాలి" అంటుంది భయాన్ని ప్రదర్శిస్తూ. తప్పదన్నట్టు అతడు వీడ్కోలిస్తే కదలిపోతుంది.

"ఏటి, బాబూ! నెల రోజులబట్టి సాయంకాలవు వేళ కాలువ గట్టుకు షికారెల్లటం మానీసినారు" అని పోలయ్య అడిగితే 'ఏంలేదులే పోలయ్యా! కాలువ ఒడ్డంతా బాగుండదు లేవయ్యా" అనేశాడు అప్పటికి రెండు నెలలు షికారెరుగడతడు.

"నిజమే, బాబూ! ఎక్కడో సోట కాలచ్చేపం అయితే శాన... అయినా, బాబూ!... వూరు మంచిదికాదు. నలుగురు నాలుగు రకాలు ... ఎల్తాను" అంటూ జారుకున్నాడు పోలయ్య.

'వూరు మంచిది కాదు. నలుగురు నాలుగు రకాలు' అని పోలయ్య అనటంతో కంగారుపడ్డాడు అతను.

ఆ రోజు సాయంత్రం ఆకాశమంతటా దట్టంగా మబ్బులు కమ్ముకున్నాయి. గాలి దుమ్ము, చిరుచీకటి ఆమె రాదేమో అని దిగులుపడుతూ పెరటివేపే చూస్తూండిపోయాడు కాని ఆమె వచ్చింది.

ఆనందంగా బావివేపు పరుగెత్తాడు.

"నీవు రావేమో అనుకున్నాను" అన్నాడు ఆమె రెండు చేతులు పట్టి.

"నేనూ రాలేనేమో అనే అనుకున్నాను. కాని ఇక రానని చెప్పడానికే వచ్చాను... ఇక నేను రాలేను" అందామె తలదించుకుని.

ఆమె చేతులు గట్టిగా పట్టుకుని, "ఏం? ఎందుకని? ... ఎందుకు రాలేవు?" అని అడిగాడు.

"ప్రతి రోజు సాయంత్రం అయ్యే ఆలస్యానికి సంజాయిషీలు చెప్పలేక పోతున్నాను. మా అమ్మ అసలే అనుమానం మనిషి ... నాకు పెళ్ళిమాటలు కూడ అవుతున్నాయి... అది చెప్పడానికే వచ్చాను."

"నీ కిష్టమేనా?"

"నా ఇష్టంతో పనేముంది? అమావాస్య తరవాత పెళ్లి చూపులు ... కుదిరితే వెంటనే పెళ్లి. అమ్మ ఆ పనిమీదే వెళ్ళింది."

"నో! అలా జరగడానికి వీలులేదు." ఆమె భుజం చుట్టూ చేతులువేసి దగ్గరకు తీసుకుంటూ అన్నాడు. వాన చినుకులు మొదలయ్యాయి. చినుకులు పెద్ద వయ్యాయి. వాన వాళ్ళమీదే కురుస్తోంది. "లేకపోతే ఏం చేస్తారు?" ఏడుపు గొంతుతో అంది.

"మీ ఇంటికి వచ్చి మీ అమ్మగారికి చెపుతాను నిన్ను పెళ్ళి చేసుకోబోతున్నట్టు."

"ఇవన్నీ ఒట్టి మాటలే. మీ కా ధైర్యముందా?"

"ఏం? మీ అమ్మ రాక్షసా! మింగేస్తుందా?" ఆమెకు మరీ చేరువ అవుతూ అన్నాడు.

"అలా అయినా బావుణ్ను. పైసా కట్నం ఇచ్చుకో లేని బీదది. ఇప్పుడు చెప్పండి."

"ఏం? నేను డబ్బుకు పుస్తె కట్టే మనిషి ననుకున్నావా?"

"ఈ పెళ్ళి జరక్కపోతే నే బ్రతకను."

"నేను మాత్రం ... అయినా అలా ఎందుకు జరుగుతుంది? మీ అమ్మ వచ్చిన వెంటనే వచ్చి కలుస్తాను - సరేనా!" అన్నాడు ఆమె తలూపింది.

వానలోనే నీళ్ళు పట్టుకుని వెళ్ళిపోతూంటే గేటు వరకు వెనుక వెళ్ళాడు.

"మరి వర్షంలో తడవకండీ. జలుబు చేస్తుంది. జ్వరం వస్తుంది. ఒళ్ళు, తల బాగా తుడుచుకోండి" అని మరీ మరీ హెచ్చరించి వెళ్లి పోయింది.

మర్నాటి ఉదయం నీళ్ళకి రాలేదు. దారిలో కంచె అవతల కనిపించనూలేదు. ఆమె కేమయిందో అని కంగారు పడ్డాడు. ఆ సాయంత్రం కూడా ఆమె రాలేదు. మరీ కంగారు పడ్డాడు. కేరియర్‌లో అన్నం అలాగే ఉండిపోయింది.

రాత్రి పది గంట అయింది. మరి ఉండలేక పోయాడు. చీకటిలోనే బయలు దేరాడు. ఊరంతా నిద్రపోతూంది ఆ వీధి మరీ నిద్రపోతూంది. నెమ్మదిగా ఆ

చీకటిలోనే ఇంటిని గుర్తు పట్టాడు. కంచె దాటి పాత పెంకుటింటి వేపు అడుగు లేశాడు. ప్రక్క పూరింటిలో చుట్టకొసన అగ్గి రవ్వ వెలగటం అతడు గమనించలేదు.

తలుపులు దగ్గరకేసి ఉన్నాయి. తలుపులు తోసి లోపలికెళ్ళాడు. చాప మీద బొంత పరుచుకుని నిద్రపోతూంది. - హరికెన్ లాంతరు మాగన్ను పెట్టి నిద్ర కొరుగుతూంది.

తలుపు దగ్గర చప్పుడు విని ఉలిక్కిపడి లేచి నాగభూషణాన్ని చూచి "మీరా! ... అయ్యో! ఇంత రాత్రి వేళ ..." అంటూ ఒంటి మీద బట్టలు సవరించుకుంటూ కంగారుపడింది.

"నేనే-నిన్ను చూద్దామని వచ్చాను. నీవెందుకు రాలేదు? నీకేమయింది?" అలా ఉన్నావేం! జ్వర మెచ్చిందా?" అంటూ కంగారుగా ఏకబిగిని ప్రశ్నలు వేశాడు.

"మిరియాల కషాయం తాగాను. తగ్గిపోతుంది... అయినా...ఈ రాత్రి వేళ మీరు అయ్యో! ఇంకేమైనా ఉందా! ఎవరైనా చూస్తే..."

" చూస్తే...ఏం? చూడనీ...రేపు పెళ్ళి చేసుకోబోయే వాళ్ళం. తప్పా! అయినా నీ వేమై పోయావో అని కంగారుగా నే వస్తే నీవనే మాట ఇదేనా!"

"అది కాదండీ. మేం బీదవాళ్ళం... మాటలు మమ్మల్ని సులభంగా అంటారు. అదే నా బాధ. నాకు మాత్రం మిమ్మల్ని చూడాలని లేదూ? రెండుసార్లు వద్దామనే అనుకున్నాను. కదలలేక పోయాను. అయ్యో! మిమ్మల్ని కష్ట పెట్టాను కాబోలు" అని ఆమె బాధపడుతూంటే తలుపు దగ్గర అలికిడైంది.

"ఎవరో వచ్చారు. ఆ ప్రక్క నిలబడండి" అంది. ఒక్క ఉదుటున పోలయ్య లోపలికి వచ్చాడు.

"ఏం బాబూ! సానికొంపలు వదిలేసి సంసార్ల ఇళ్ళలోకి జొరబడమని సెప్పారా మీకు సదువులు! అర్థరేత్రి... మరియాదేనా ఇది? అవతలకి నడవండి." అరిచేట్టుగా అన్నాడు.

"పోలయ్యా! పోలయ్యా!" అంటూ వారించ బోయింది. "నివ్వు పల్లకోమ్మా. తెల్లబట్ట లేసికునే ఈ బాబుల సంగతి నాకెరిక. అవసరం తీరినాక దులువుకు పొయ్యే రకాలు. నాలుగు నెలల కాడ్నించి సూస్తన్నా నీ యవ్వారం. పద. వీధిని లేపి యవ్వారం అందరికీ సెప్తా."

"పోలయ్యా! అనవసరంగా మాటలనకు. వీధిని పంచాయితీ పెట్టే పరిస్థితి ఏమీ లేదు. మేము ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకుంటాం. ఈ రోజంతా కనిపించకపోతే ఉండబట్టలేక వచ్చాను. వీళ్ళమ్మగారు రాగానే పెళ్ళి మాటలు..."

"నికరమేగా..." తలపాగా సవరించుకుంటూ అడిగాడు.

"నికరమే!"

"నా సంగతి కూడ ఎరికే కదా. నానో పచ్చి రవుడీని. గైరీ పున్నమి పండగలికి

పులేషం వేసి గొతిపోతు మెడ కసక్కున కొరికే మొనగాన్ని. ఎరికా! వూరు మంచిది కాదు. నా నసలే మంచోన్ని కాను" అని హెచ్చరించాడు.

"నీకు పని కల్పించనులే, పోలయ్యా!" అన్నాడు నాగభూషణం. మరో నెలకే ఇద్దరి పెళ్లయింది. నాగభూషణం బీదింటి పిల్ల నెలా పెళ్ళి చేసుకున్నాడో ఎవరికీ అర్థం కాలేదు!

పెళ్ళయిన మర్నాడు ఆమె పోలయ్యకి, "అన్నలా ప్రతి రోజూ కాపాడేవాడివి. నీ ఋణం ఎలా తీర్చుకోనూ" అంటూ వంద రూపాయలిచ్చిన సంగతి నాగభూషణానికి తెలీదు.

ప్రతిరోజు బిందెలకు బిందెలు నీళ్ళను మోసుకుపోయే ఆమె వంటకి ఎక్కడ నుండో నీరెందుకు తెప్పిస్తుందో తెలీదు. ఎండాకాలంలో కూడా ఎవరూ ఆ బావి నీరు వాడరన్న సంగతి అతనికి తెలీదు. పెళ్ళయిన తరువాతే తెలసిందతనికి ఆమె పేరు పార్వతి అని. అవును! ఆమె పార్వతే.

★ ★ ★